సాక్షి రంగారెడ్డి

శనివారం । 30 । మార్చి । 2024



ప్రజా పాలనతో న్యాయం

సీఎం రేవంత్‌రరెడ్డి నాయకత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. 8లో▸



గంజాయి విక్రేతలకు రిమాండ్

ఇంజనీరింగ్ విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి వ్యాపారం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
శనివారం సాయంత్రం 6:35	ఆదివారం ఉదయం 4:49

న్యూస్‌రీల్

విద్యార్థుల్లో విజ్ఞానం పెంచేందుకే సమ్మర్ క్యాంప్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో శారద



సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థినులతో అధికారులు, అధ్యాపకులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేలా, క్రమశిక్షణ అలవర్చుకునే విధంగా సమ్మర్ క్యాంప్ నిర్వహించినట్లు గురుకులాల ఆర్‌సీవో శారద అన్నారు. 15 రోజులుగా మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల చేవెళ్ల గురుకుల కళాశాలలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పది కళాశాలలకు చెందిన విద్యార్థినులకు వివిధ రకాల నైపుణ్య కోర్సులను నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ముగింపు సమావేశానికి చేవెళ్ల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షత వహించగా శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థినులు సెలవు దినాల్లో సమయం వృథా చేయకుండా వారి విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. 15 రోజుల పాటు వివిధ మండలాల్లోని ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థినులు ఆయా అంశాల్లో తర్ఫీదు పొందారని చెప్పారు. కార్యక్రమంలో బంట్వారం ప్రిన్సిపాల్ ఉషారాణి, రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్లైవుడ్ గోదాంలో అగ్నిప్రమాదం

సుమారు రూ.కోటిన్నర నష్టం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

హయత్‌నగర్: తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని తొర్రూర్‌లో ఉన్న గీతా టింబర్ డిపోలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. టింబర్ డిపో గోదాంలో నిల్వ ఉన్న ప్లైవుడ్ పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదానికి కరెంట్ షాక్ కారణమని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గోదాం పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.కోటిన్నర వరకు నష్టం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నేడు అంబర్‌పేట్‌కు కేటీఆర్

అంబర్‌పేట్: అంబర్‌పేట్ నియోజకవర్గంలో శనివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించనున్నారని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన నివాసంలో పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేటీఆర్ పర్యటనపై చర్చించారు. నియోజకవర్గంలోని అంబర్‌పేట్ డివిజన్‌లో కేటీఆర్ పర్యటన ఖరారయిందని ఆయన వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు చేపట్టే పాదయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, మేడిప్రసాద్, సిద్ధార్థ ముదిరాజ్, భీష్మ పాల్గొన్నారు.

గెలవాల్సిందే..

చేవెళ్ల లోక్‌సభ స్థానంపై ప్రధాన పార్టీల గురి

- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధిష్టానాలు
- అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహప్రతివ్యూహాలు
- పోటాపోటీగా సమావేశాలు
- అభ్యర్థుల ముమ్మర ప్రచారం
- కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్న ముఖ్య నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఎలాగైనా గెలిచి తీరాలని భావిస్తున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీలు అభ్యర్థులను కూడా ప్రకటించాయి. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి బరిలో నిలిచారు. ఇక బీఆర్‌ఎస్ నుంచి మాజీ జెడ్పీ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీ చేస్తున్నారు. వీరు ముగ్గురు ఆర్థికంగానే కాకుండా సామాజికంగా గట్టి పట్టున్నవారే. ముగ్గురు ఉద్దండులు తలపడుతుండటంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. రోజుకో నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇతర పార్టీల్లోని ముఖ్య నేతలు, అసంతృప్తులను తమ వైపు తిప్పుకొంటూ చేరికలను ప్రోత్సహిస్తున్నారు. సంస్థాగతంగా తమ బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

కాంగ్రెస్ వరుస సమావేశాలు

సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా చేవెళ్లకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఎలాగైనా ఇక్కడ గెలవాలని బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించి, ఆయన్ను కాంగ్రెస్ నుంచి బరిలోకి దించారు. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ వేదికగా చేవెళ్ల ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. నేతలంతా కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని, రంజిత్‌ను గెలిపించాలని కోరారు. తాజాగా శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తుక్కుగూడ వేదికగా మహేశ్వరం నియోజకవర్గం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు.

చేవెళ్లలో బీఆర్‌ఎస్‌కు మంచి పట్టుంది. 2014, 2019లో వరుసగా రెండు సార్లు గెలుచుకుంది. 2014లో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన విశ్వేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం బీజేపీ తరఫున బరిలో ఉండగా, 2019లో గెలిచిన గడ్డం రంజిత్‌రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండడం విశేషం. పార్టీని వీడిన వారికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలంటే చేవెళ్లలో పట్టు కోల్పోకుండా చూసుకోవాలని గులాబీ హైకమాండ్ నిర్ణయించింది. బలమైన సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను బరిలోకి దించింది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కేసీఆర్ ఇప్పటికే పలుమార్లు జిల్లా ముఖ్య

కేసీఆర్, కేటీఆర్ దిశానిర్దేశం

నేతలతో సమావేశమై పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి పటోళ్ల సబితా రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్, పరిగి, మహేశ్వరం సహా పలు నియోజవర్గాల్లో ముఖ్య నేతలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. తాజాగా శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్‌ఎస్ భవన్‌లో చేవెళ్ల ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే నెల 13న చేవెళ్ల కేంద్రంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పార్టీని వీడే వాళ్లను చూసి అధైర్యపడొద్దని, కష్టకాలంలో అండగా నిలిచే వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇస్తున్నారు.

బీజేపీ 'ప్రజా ఆశీర్వాద యాత్ర'

బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఒంటరి పోరాటం చేస్తున్నారు. ఆయన పూర్తిగా ప్రధాని మోదీ ఇమేజ్‌నే నమ్ముకున్నారు. విమర్శలు, వివాదాలకు పోకుండా వ్యక్తిగత ఇమేజ్‌ని మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. బూత్ లెవల్ కేడర్‌తో నిత్యం టచ్‌లో ఉంటున్నారు.. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, కుల సంఘాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓటర్లకు మరింత దగ్గరయ్యే ప్రయత్నంలో భాగంగా రెండు రోజుల క్రితం శంషాబాద్ మండలం అమ్మపల్లి సీతారామచంద్ర స్వామి దేవాలయం నుంచి ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో జనంలోకి బయలు దేరారు. శుక్రవారం పరిగి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చింతపల్లి, మేడిపల్లి, మాచన్‌పల్లి, మాదారం, రంగాపూర్, పరిగి, రాఘవాపూర్, తదితర గ్రామాల్లో యాత్ర చేపట్టారు. స్థానికులతో మమేకం అవుతూ, వారి కష్ట సుఖాలు అడిగి తెలుసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఎందుకు ఓటు వేయాలో వివరిస్తున్నారు. ఔత్సాహికులు, అభిమానులను పార్టీలో చేర్చుకుంటూ సంస్థాగతంగా బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి

కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

మహేశ్వరం: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తుక్కుగూడలోని గిగా సిటీ కేఎల్‌ఆర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ పార్టీ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేయడానికి ఆ పార్టీలో చేరానన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొంతమంది నేతలు తనపై అసత్య ఆరోపణలు, విమర్శలు చేయడాన్ని ఖండించారు. కేంద్రంలో పదేళ్ల బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రశ్నించే గొంతుకలను నరేంద్ర మోదీ అణచివేసి అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో చేవెళ్లతో పాటు 14 ఎంపీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితారెడ్డికి గేట్లు తెరిచేది లేదన్నారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో చర్చించిన తర్వాత వారు అంగీకరిస్తే ఇతర పార్టీలకు చెందిన వారిని చేర్పించుకుందామన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని.. సోనియమ్మ, రాహుల్ గాంధీకి కానుకగా ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో జెడ్పీచైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభను విజయవంతం చేయాలి

తుక్కుగూడలో వచ్చేనెల 6న నిర్వహించే కాంగ్రెస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బహిరంగ సభా స్థలాన్ని కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వచ్చి తెలంగాణకు ఆరు గ్యారంటీలను ప్రకటించిట్టే.. రాహుల్ గాంధీ తుక్కుగూడ సభకు హాజరై జాయతీ స్థాయిలో 5 గ్యారంటీలను ప్రకటించనున్నారని తెలిపారు. 25 అంశాలతో గ్యారంటీ స్కీంలను తమ మేనిఫెస్టోగా రూపొందించిందన్నారు. పాంచ్ న్యాయ్ అంటూ మేనిఫెస్టోకు పార్టీ నామకరణం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను తుక్కుగూడ వేదికగా రాహుల్ గాంధీ, ఖర్గే ప్రకటించనున్నట్టు చెప్పారు. సభకు ప్రతి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.



మొయినాబాద్: మెథడిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లా వ్యాప్తంగా గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు వేషధారణల్లో సిలువ మోసి ఆయన త్యాగాలను కళ్లకు కట్టారు. జీసస్ సత్య సందేశాన్ని సమస్త మానవాళికి చాటిచెప్పిన విధానాన్ని ప్రదర్శించారు. పాస్టర్లు ఏసుప్రభు సందేశాన్ని వినిపించారు.



షాబాద్: మరియాపురం చర్చి వద్ద..

'పట్నం' కట్టపై పంచముఖ హనుమాన్

108 అడుగుల భారీ విగ్రహం

- తెలంగాణలోనే తొలి ఎత్తయిన ప్రతిమ
- ఏర్పాటుకు నేడు అంకురార్పణ

ఇబ్రహీంపట్నం రూరల్: సదా ధర్మకార్య, దేశ కార్య సేవలో హరివర అఖండ క్షేత్ర సమితి ఆలోచన కార్యరూపం దాల్చింది. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కేంద్రంగా 108 గ్రామాల ప్రజల సహకారంతో 108 అడుగుల పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం రూపుదిద్దుకోనుంది.అందులో భాగంగాశనివారం విగ్రహ అంకుర్పారణ జరగనుంది.ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు హనుమంతుడి రక్ష కల్పించాలనే సంకల్పంతో హరివర అఖండ క్షేత్ర ట్రస్టు ద్వారా ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నం కొలిక్కివచ్చింది. కొనకట్టపై 108 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు పనులు ప్రారంభం కానున్నాయి.2014లో సంకల్పం తీసుకున్న యువత ట్రస్టుకు శ్రీకారం చుట్టింది. ఏటా కార్తిక పౌర్ణమి రోజున గంగా హారతి ఇవ్వడం, ఇక్కడి దీపాన్ని తీసుకెళ్లి రాచకొండ గుట్టలోని శివాలయం వద్ద జ్యోతిని వెలిగించడం చేస్తున్నారు. చిన్న ఆలయం నిర్మించి ప్రతి మంగళవారం 108 గ్రామాల్లో హనుమాన్ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. 200 వారాలు పారాయణాలు పూర్తి చేశారు. రూ.5కోట్లతో తెలంగాణలో ఎక్కడా లేని విధంగా హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠించనన్నారు. ఈ విగ్రహం పూర్తయితే రాష్ట్రంలోనే తొలి ఎత్తయిన విగ్రహం కానుంది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి పర్యవేక్షణలో ప్రతిష్ఠాపన పనులు జరుగుతున్నాయి. ప్రాజెక్టు నివేదికను రూపొందించారు. యాగశాల, వ్యాయామశాల, పార్కు, నివాస గృహ సముదాయం ఇందులో ఉన్నాయి.సాగర్ రోడ్డుకు ఆధ్యాత్మిక శోభనిచ్చేలా క్షేత్రం రూపుదిద్దుకోనుంది.

హరివర అఖండ క్షేత్రంగా..

ఇబ్రహీంపట్నం కొనకట్టపై ఉప్పరిగూడ, శేరిగూడ, ఇబ్రహీంపట్నం గ్రామాలకు మధ్యలో పెద్దచెరువుకు రక్షణగా 108 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు పునాది రాయి వేయనున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి చేతుల మీదుగా పనులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే హరివర అఖండ క్షేత్రంగా నామకరణం చేశారు. దైవ కార్యంలో ధర్మ కార్యంలో అందరూ సమానులే అందరూ సామాన్యులే, అందరూ ఆహ్వానితులే అని ట్రస్టు సభ్యులు తెలిపారు.



108 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహ నమూనా

యువతలో ప్రేరణ నింపేందుకే..



ఈ ప్రాంత యువతకు ప్రేరణగా నిలిచేందుకు ఈ కార్యక్రమం చేపట్టాం. భవ్యమైన విగ్రహ నిర్మాణంలో 14 శాతం యువత సమర్పణతో ఇచ్చిన విరాళాలు ఉండాలని నిర్ణయించాం. ఇలా అనేక అశాయాల బంధనాలతో తెలంగాణలోనే ఎత్తయిన విగ్రహంగా నిలవాలనే ఆశయంతో పని చేస్తున్నాం. ప్రత్యక్ష రాజకీయాల్లో బాధ్యతలు లేని 108 మంది సభ్యులతో పనులు జరుగుతున్నాయి.

– సదావెంకట్‌రెడ్డి, ట్రస్టు వ్యవస్థాపకుడు

ఎలక్ట్రోల్ బాండ్ల రూపంలో ఆర్థిక దోపిడీ

- ఆర్థిక వనరులను అదాని, అంబానీలకు కట్టబెడుతున్న బీజేపీ
- ఆ పార్టీకి ఓట్లడిగే హక్కు లేదు
- టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్

మొయినాబాద్: సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎస్‌బీఐ ఎలక్ట్రోల్ బాండ్ల వివరాలను బయట పెట్టడంతో భారతీయ జనతా పార్టీ ఆర్థిక దోపిడీ, లంచగొండితనాన్ని ఏ మేరకు పెంచి పోషిస్తుందో తెలుస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ ఆరోపించారు. మొయినాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీకి ఒక్క మెగా కంపెనీ రూ.1,128 కోట్ల విలవ చేసే బాండ్లను ఇచ్చిందని.. దీన్ని బట్టి ప్రజాధనం ఏ మేరకు దుర్వినియోగం అవుతుందో అర్థం చేసుకోవచ్చన్నారు. 1,128 కోట్ల విలువ చేసే బాండ్లు ఇచ్చిన కంపెనీకి ప్రభుత్వాలు ఎంత లబ్ధిచేకూర్చాయో మోదీ, అమిత్‌షా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. దేశంలోని ఆర్థిక వనరులను అదాని, అంబానీలకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. విదేశాల్లో దాచిన నల్లధనాన్ని బయటకు తీసి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పిన ప్రధాని మోదీ పదేళ్లయినా ఎందుకు బయటకు తీసి ఖాతాల్లో వేయలేదని ఇప్పుడు ప్రజలే ప్రశ్నిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను అడ్డం పెట్టుకుని దేశంలోని జాతీయ, ప్రాంతీయ పార్టీలపై ఉసిగొల్పి వాటి ఉనికినే ప్రశ్నార్థకంగా చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా తల్లిని చంపి బిడ్డను ఇస్తారా అని మాట్లాడిన బీజేపీకి ఇప్పుడు తెలంగాణకు వచ్చి ఓట్లు అడిగే హక్కులేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ ప్రభుత్వానికి, బీజేపీకి ప్రజలంతా తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు వీరభద్రస్వామి, వెంకట్‌రెడ్డి, నాయకులు కేబుల్ రాజు, రవీందర్‌రెడ్డి, రాజుగౌడ్, జైపాల్‌రెడ్డి, కుమార్, మహేందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గౌరి సతీష్

రికార్డ్ బ్రేక్!

- విద్యుత్ వినియోగం పైపైకి
- మే నెలలో నమోదు కావాల్సిన రికార్డు మార్చిలోనే..
- గత ఏడాది మే 19న 79.33 ఎంయూలు
- తాజాగా మార్చి 28న 79.48 ఎంయూలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రేటర్‌లో నమోదవుతున్న విద్యుత్ వినియోగం ఇంజినీర్లకు ముచ్చెమటలు పట్టిస్తోంది. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. ఒకప్పుడు విలాసవంతమైన భవనాల్లో మాత్రమే దర్శనమిచ్చే ఏసీలు.. ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి గృహాల్లోనూ కన్పిస్తున్నాయి. రోజంతా వీటిని ఆన్ చేసి ఉంచుతుండటంతో కరెంట్ వినియోగం రెట్టింపు నమోదవుతోంది.

సామర్థ్యానికి మించిపోవడంతో..

- సాధారణంగా ఏప్రిల్/మే నెలల్లో రికార్డు స్థాయిలో వినియోగం ఉండేది. ఈ ఏడాది మార్చి చివరి వారంలోనే నమోదు కావడం విశేషం. గ్రేటర్‌లో గత ఏడాది మే 19న రికార్డు స్థాయిలో 79.33 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, తాజాగా గురువారం (మార్చి 28న) 79.48 ఎంయూలు నమోదు కావడం గమనార్హం. సామర్థ్యానికి మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతుండటంతో సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఆయిల్ లీకేజీలకు అధిక ఉష్ణోగ్రతలు తోడవడంతో షార్ట్‌సర్క్యూట్‌లతో డీటీఆర్‌లలో సాంకేతిక సమస్యలు తలెత్తి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి.

నిరంతర పర్యవేక్షణ

- 2023 మార్చిలో అత్యధిక విద్యుత్ వినియోగం 67.97 మిలియన్ యూనిట్లు మాత్రమే. గత మార్చిలో సరాసరి వినియోగం 57.84 మిలియన్ యూనిట్లు. అదే ఈ ఏడాది మార్చిలో సరాసరి వినియోగం ఏకంగా 70.96 మిలియన్ యూనిట్లు నమోదైంది. గతంతో పోలిస్తే ఈసారి అదనంగా 22.7 శాతం రికార్డు అయ్యింది.
- వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలకు ఆస్కారం ఇవ్వకుండా సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ముందస్తుగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే లైన్ల పునరుద్ధరణ, నిర్వహణ పనులు పూర్తి చేయించారు. సీజీఎంలు, ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఆర్టిజన్లు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు ఉదయం 8.30 గంటలకు జోన్లు, సర్కిళ్ల వారీగా టెలికాన్ఫరెన్సులు నిర్వహిస్తున్నారు. డిమాండ్ సరఫరాపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ ఒత్తిడికి లోనవుతున్న ఫీడర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.
- సమస్యాత్మక ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి కరెంట్ పోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయాల బలోపేతం కోసం, సీబీడీ, లైన్స్ వంటి ఇతర విభాగాలను ఏకీకరణ చేసి ఆపరేషన్ అసిస్టెంట్ ఇంజినీర్లకు బాధ్యతలు అప్పగించారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి వ్యాపారం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని ధూల్‌పేట్ ప్రాంతానికి చెందిన రాజుసింగ్(37) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆరు నెలలుగా వినాయక విగ్రహాలు తయారు చేస్తుండే వాడు. వ్యసనాలకు బానిసైన రాజుసింగ్ కూలీ డబ్బు సరిపోకపోవడంతో గంజాయి అమ్మే వ్యాపారాన్ని ఎంచుకున్నాడు. ఇదే ప్రాంతంలో ఉండే ఆశిష్‌సింగ్, బీజ్మాబాయి వద్ద రూ.10వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్ చుట్టుపక్కల రూ.15వేలకు కిలో చొప్పున విక్రయిస్తున్నాడు. గంజాయి తాగుడుకు బానిసైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లా కందుకూరు మండలానికి చెందిన ఉప్పు లోకేశ్వర్ ఇంజాపూర్ సమీపంలోని కమ్మగూడ ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. రాజుసింగ్ మాదిరిగా వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్న ఆయన వారం రోజుల క్రితం 1.5 కేజీల గంజాయి కొనుగోలు చేసి 50 గ్రాముల ప్యాకెట్‌లు తయారు చేసి ఆదిబట్ల చుట్టు ప్రక్కల కంపెనీలు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, వండర్‌లా వద్ద అమ్మి డబ్బులు సంపాదిస్తుంటాడు. గంజాయి సేవించే వ్యక్తులు బబ్లు, సంతోష్, సెల్వా, శివ, కరణ్, అప్పు, మీనాజ్ నాలుగు కేజీలు కావాలని కోరారు. దీంతో లోకేశ్వర్ రాజుసింగ్‌కు ఫోన్ చేయగా 2 కేజీలు ఉందని చెప్పాడు. రాజుసింగ్ 2 కేజీలతో, లోకేశ్వర్ 1.2 కేజీలతో ఆదిబట్ల మున్సిపాలిటీలోని బీరప్ప గుడి వద్ద కలుసుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు మహేశ్వరం డీసీపీ ఆదేశాల మేరకు రాజుసింగ్(37), లోకేశ్వర్ (20)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద 3.2 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాజుసింగ్‌పై గతంలో పలు పోలీస్ స్టేషన్లల్లో ఎన్‌డీపీఎస్ యాక్టు కేసులు నమోదయ్యాయన్నారు. గంజాయికి అలవాటు పడిన విద్యార్థులకు సరైన అవగాహన కల్పిస్తామని.. దురలవాట్ల జోలికి పోకూడదని సీఐ రాఘవేందర్‌రెడ్డి సూచించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ కృష్ణయ్య, వెంకటేశ్‌లతో పాటు పోలీసు సిబ్బందిని అభినందించారు.

ప్రజా పాలనతో సమన్యాయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనను చూసి వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాలకు చెందిన పలువురు నాయకులు కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందుతాయని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పాలన న్నిన ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు, నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆయన చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని స్థానాలలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏప్రిల్ 1న బీఎల్‌ఏలకు శిక్షణ

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని ఏసీఆర్ గార్డెన్స్‌లో ఏప్రిల్ 1న అచ్చంపేట, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల బూత్ లెవెల్ ఏజెంట్స్ శిక్షణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. శిక్షణ సమావేశానికి ఏఐసీసీ కో ఆర్డినేటర్ కొప్పుల రాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి తదితరులు హాజరవుతారని ఆయన చెప్పారు. సమావేశానికి కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్‌బూత్‌ల ఏజెంట్‌లు, అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యవర్గం, అనుబంధ సంఘాల అధ్యక్షులు హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు.

బాలిక దారుణ హత్య

రాజేంద్రనగర్: ఓ బాలిక దారుణ హత్యకు గురైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జల్‌పల్లి శ్రీరాంనగర్ కాలనీకి చెందిన బాలిక కుటుంబం గతంలో అత్తాపూర్ హసన్‌నగర్ ప్రాంతంలో మోయిన్ అనే యువకుడి కుటుంబానికి చెందిన ఖాళీ స్థలంలో నివాసం ఉండేది. ఇద్దరు పిల్లల తండ్రి అయిన మోయిన్ తరుచూ సదరు బాలిక వెంట పడుతుండటంతో ఆమె కుటుంబం అక్కడ ఇల్లు ఖాళీ చేసి శ్రీరాంనగర్ కాలనీకి మకాం మర్చింది. అయినా మొయిన్ ఆమెను వేధిస్తూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆమెను కాటేదాన్ ప్రాంతానికి పిలిపించాడు. అనంతరం ఆమెను కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బండరాయితో మోది హత్య చేసి అక్కడినుంచి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం వాకింగ్ చేసేందుకు వచ్చిన స్థానికులు బాలిక మృతదేహాన్ని గుర్తించి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహన్ని మార్చురీకి తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఆచూకీని గుర్తించిన పోలీసులు ఆమె తల్లిదండ్రులను విచారించగా హసన్‌నగర్‌కు చెందిన మోయిన్‌పై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి ఐదు దుకాణాల్లో చోరీ

హార్డ్ డిస్క్‌లు, సెల్‌ఫోన్స్, రూ.50వేల నగదు మాయం

చేవెళ్ల: పట్టణంలోని ఐదు దుకాణాల్లో అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనలో హార్డ్ డిస్క్‌లు, సెల్‌ఫోన్స్, రూ.50వేల నగదు, ఇతర సామాన్లు దోచుకెళ్లారు. ఈ ఘటన మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన ప్రకారం.. అర్ధరాత్రి మొదట శాంతి మనీ ట్రాన్స్‌ఫర్ షాపు పైకప్పు రేకులు తొలగించి సీసీ కెమెరాల హార్డ్ డిస్క్, ఇంటర్నెట్ బాక్స్, రూ.10వేల నగదు, మొబైల్ ఫోన్స్ , అదే లైన్‌లో ఉన్న మణికంఠ ట్రేడర్స్ దుకాణంలో రూ.10వేల నగదు, కిరాణ సామగ్రి, మరో కూల్ పాయింట్, జనరల్ దుకాణంలో ఇంటర్నెట్ బాక్స్, నగదు, శ్రీబాలాజీ స్టీల్, సిమెంట్ షాపులో రూ.11వేల నగదు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ దొంగిలించారు. రమేశ్ లాండ్రీ షాపులో చొరబడి నగదు, ఐరన్ బాక్స్ ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం షాపులు తెరవగానే అంతా చిందరవందరగా ఉండటంతో పాటు నగదు, హార్డ్‌డిస్క్‌లు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరకున్న పోలీసులు షాపులను పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తాటిచెట్టుపై నుంచి పడిన గీతకార్మికుడు

తీవ్ర గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బండరావిరాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఓరుగంటి భిక్షపతి గౌడ్ గీత కార్మికుడు. రోజు మాదిరిగానే ఉదయం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు మోకు జారీ కిందపడ్డాడు. ఈ ఘటనలో క్షతగాత్రుడికి తీవ్రగాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

సారాయి తయారు చేస్తే కఠిన చర్యలు


ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన నాటుసారా, నిందితులను చూపుతున్న పోలీసులు

- ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్
- ఎక్సైజ్ దాడుల్లో నలుగురి అరెస్ట్

ఆమనగల్లు: ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాలుగు కేసులు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. పీఎస్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలంలోని గ్రామాలు, తండాల్లో తనిఖీలు చేపట్టారు. మాడ్గుల మండలం కేతావత్ తండాలో గోపాల్, మాలి దగ్గర నాలుగు లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకున్నారు. మాడ్గుల మండలం కొర్రతండాలో బలరాం, శంకర్ వద్ద సారాయిని సీజ్ చేశారు. కొర్రతండా గుట్టల సమీపంలో సారాయి తయారీ కేంద్రంపై దాడి చేసి బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ జిల్లా ఇన్‌చార్జి, సీఐ చంద్రశేఖర్, డీటీఎఫ్ సరూర్‌నగర్ టీం ఇంచార్జి, సీఐ సత్యానారాయణ, మహేశ్వరం ఎక్సైజ్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ సీతారాం రెడ్డి, పెద్ద ఎత్తున ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు. అనంతరం ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం దాడులు నిర్వహిస్తామని, నాటుసారా తయారుచేసినా, విక్రయించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్క్రాప్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం


దట్టంగా అలుముకున్న పొగ

శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడ రహదారిలో గల స్క్రాప్ దుకాణంలో శుక్రవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్‌తో షాపులోని పేపర్లు, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలకు మంటలు వ్యాపించాయి. వెనుక భాగంలో పెద్ద ఎత్తున నిల్వ చేసిన పేపర్లు, ప్లాస్టిక్ బ్యాగులు, ఇతర వ్యర్థపదార్థాలను కూడా అంటుకున్నాయి. దీంతో స్థానికులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. పక్కనే గ్యాస్ ఏజెన్సీ ఉండడంతో సిబ్బంది వెంటనే సిలిండర్లను బయటకు తీసుకెళ్లారు. మూడు ఫైరింజన్ల సాయంతో రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శుక్రవారం మున్సిపల్ కార్మికులపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని మెయిన్ రోడ్డుపై పిల్లర్ నంబర్ 207 వద్ద ఫుట్‌పాత్‌పై అక్రమంగా కొందరు వ్యక్తులు వ్యాపారం చేస్తున్నారని వాటిని తొలగించాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు వచ్చిందన్నారు. దీంతో రాజేంద్రనగర్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాటిని తొలగించాలని కార్మికులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అక్కడికి వెళ్లిన కార్మికులు కొబ్బరిబొండాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ బండిలో వేస్తుంటే అక్కడే వ్యాపారం చేస్తున్న ముగ్గురు వ్యక్తులు వచ్చి కార్మికులపై రాళ్లు, కట్టెలు, కొబ్బరిబొండాలను తీసుకొని దాడి చేశారని ఆరోపించారు. దాడిపై రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

మతిస్థిమితం లేని యువతి అదృశ్యం

పది రోజుల తర్వాత పోలీసుల సాయంతో తల్లి చెంతకు


యువతిని గ్రామస్తులకు అప్పగిస్తున్న వనపర్తి పోలీసులు

షాబాద్: మతిస్థిమితం లేని ఓ యువతి పదిరోజుల క్రితం అదృశ్యమైంది. తల్లి ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాక ఆమె అనారోగ్యానికి గురైంది. చివరికి యువతి వనపర్తి పోలీసులకు చిక్కింది. ఓ హోటల్ వద్ద రోదిస్తూ కనిపించడంతో యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆమె వద్దనున్న ఆధార్ కార్డు సాయంతో వనపర్తి పోలీసులు షాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి బాలమ్మకు సమాచారం చేరవేయడంతో శుక్రవారం గ్రామస్తులు రాము, నవీన్, గణేశ్, శ్రీరామ్ వనపర్తి రూరల్ పోలీస్టేషన్‌కు వెళ్లి యువతిని తీసుకు వచ్చి తల్లికి అప్పగించారు. బాలమ్మ కుమారుడు మహేందర్ పదేళ్ల క్రితం ఇల్లు వదిలి పోయాడు. ఇప్పటికి తన సమాచారం కుటుంబ సభ్యులకు తెలియరాలేదు.

కారు బోల్తా


గుంతలో పడిపోయిన కారు

కుల్కచర్ల: అదుపుతప్పిన కారు బోల్తాపడింది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శంకర్‌పల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు మారుతి ఎర్టిగా కారులో వాల్యానాయక్ తండాలో వివాహానికి హాజరయ్యారు. తిరుగుప్రయాణంలో మూజాహిద్‌పూర్ గేటు సమీపంలో వాహనం అదుపుతప్పి అటవీశాఖ తవ్విన ట్రెంచ్‌లో పడిపోయింది. కారులో ఉన్న శరత్‌కు చేయి ఫ్యాక్చర్ అవ్వగా.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ప్రపంచమే ఓ రంగస్థలం



మల్లాది గోపాలకృష్ణను సత్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, ఆకృతి సుధాకర్ తదితరులు

జస్టిస్ చంద్రకుమార్

వనస్థలిపురం: ప్రపంచమే ఓ రంగస్థలమని, మనమంతా అందులో పాత్రధారులమని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో వనస్థలిపురం హిల్ కాలనీలో ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లాది గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రంగస్థల నటుడిగా ప్రత్యేకతను చాటుకున్న మల్లాది గోపాలకృష్ణను సన్మానించడం అభినందనీయన్నారు. గోపాలకృష్ణ తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు మార్గదర్శిగా, ఆహార్యం విభాగంలో అధ్యాపకులుగా సేవలు అందిస్తున్నారన్నారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాది శేషు మట్లాడుతూ రంగస్థల కళల విస్తృతికి గోపాలకృష్ణ చేస్తున్న కృషి ఎనలేనిదని, ఆయన ఐదు నంది అవార్డులను స్వీకరించారన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మదర్ థెరిసా ఫౌండేషన్ అధ్యక్షుడు శంకర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతిపై లైంగిక దాడి

ఫుడ్ డెలివరీ బాయ్ అరెస్ట్

బంజారాహిల్స్: మాట్లాడే పని ఉందని చెప్పి హోటల్‌కు పిలిచి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన ఫుడ్ డెలివరీ బాయ్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మల్లేపల్లికి చెందిన ఒబేదుల్లాఖాన్ (23) ఫుడ్ డెలివరీ బాయ్. ఎనిమిది నెలల క్రితం లక్డీకాపూల్‌లో ఓ సెమినార్‌కు హాజరైన ప్రైవేటు ఉద్యోగిని (22) ఫుడ్ ఆర్డర్ చేయడంతో ఒబేదుల్లా ఆమెకు అందజేశాడు. ఆమె డబ్బులను గూగుల్ పే చేయడంతో ఆ నంబర్ తీసుకున్న ఒబేదుల్లా ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ పరిచయం పెంచుకున్నాడు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉండే సదరు యువతి ఒబేదుల్లాకు సన్నిహితమైంది. ఇదే అదనుగా భావించినన ఒబేదుల్లా గురువారం రాత్రి మాట్లాడే పని ఉందని ఆమెను తన బైక్‌పై తీసుకుని బంజారాహిల్స్‌లోని ఓయో రూమ్‌కు వచ్చాడు. రాత్రి ఒంటి గంట తర్వాత ఆమె నిద్ర మత్తులో ఉండగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై ఐపీసీ 376, 354, 354 (ఏ), డి, 376, 66 (ఇ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.